www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 25 అక్టోబర్ 2025

5

అన్నమయ్య



ఆర్‌టిసిలో మెకానిక్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి -రాయచోటి టౌన్

జిల్లాలోని అన్ని ఆర్‌టిసి డిపోల్లో మెకానిక్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పర్సనల్ ఆఫీసర్ ఆర్.సురేష్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రిన్సిపల్ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాల కర్నూల్ వారి ఆదేశాల మేరకు జిల్లాలోని ఆర్‌టిసి డిపోలో పనిచేయుటకు ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఐటిఐ ఉత్తీర్ణులై 8/11/2025 తేదీలోగా www.apprenticeshipindia.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో డీజిల్ మెకానిక్ 33, మోటార్ మెకానిక్ 4, ఎలక్ట్రీషియన్ 4, వెల్డర్, పెయింటర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ ఒకటి చొప్పున మొత్తం 44 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మాత్రమే తమ ఒరిజినల్ సర్టిఫికెట్, ఒక సెట్ జిరాక్స్ కాపీతో ఆర్‌టిసి జోనల్ సిబ్బంది శిక్షణ కళాశాల కర్నూల్‌లో హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు కార్యాలయ పని దినాలలో ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు 08518-257025 నెంబర్‌కు ఫోన్ ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు.

ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరాటం

- ఎపిఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్



మాట్లాడుతున్న ఎపిఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్

ప్రజాశక్తి-రాయచోటి/రాయచోటి అర్బన్

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని ఎపిఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎన్‌జిఒ భవన్‌లో ఉద్యోగులు, పెన్షనర్ల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అంతకు ముందు విద్యాసాగర్ రాయచోటికి విచ్చేసిన సందర్భంగా జనరల్ సెక్రెటరీ డి.వి.రమణ, ఉమ్మడి జిల్లా ఎన్‌జిఒ ఉద్యోగులు స్వాగతం పలికారు. బంగ్లా సర్కిల్ నుంచి ఎన్‌జిఒ హోమ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఉద్యోగులు, పెన్షనర్లు పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యాసాగర్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 26 జిల్లాల్లో ఎన్‌జిఒ నూతన కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉద్యోగ సంఘాలను పిలిపించి డిఎ ఇస్తామని చెప్పడం చాలా సంతోషంగా ఉందన్నారు. హెల్త్ కార్డులు 60 రోజుల్లో అందిస్తామని చెప్పారని తెలిపారు. ఉద్యోగులకు, పెన్షనర్లకు ఇన్సూరెన్స్ అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మహిళ ఉద్యోగులకు చైల్డ్ కేర్‌లీవ్‌లు రిటైర్‌మెంట్ వరకు వాడుకునేందుకు వీలు కల్పిస్తామన్నారు. ఆర్‌టిసి ఉద్యోగులు మూడు సంవత్సరాలుగా ప్రమోషన్లు లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని సిఎం దృష్టికి తీసుకెళ్లి వారందరికీ ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు ప్రమోషన్లు కల్పించాలని నెల రోజులుగా రాష్ట్ర యంత్రాంగానికి, చీఫ్ సెక్రటరీకి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆరు సంవత్సరాలుగా ఉద్యోగుల చీకటి యుగంలో మగ్గారని తెలిపారు. 3600 మందికి పైగా కేసులు కూడా గత ప్రభుత్వం బనాయించిందన్నారు. హెచ్‌ఆర్‌ఎ, ఫిట్మెంటును కోల్పోయామని తెలిపారు. ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.32,500 కోట్ల బకాయిలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. దశల వారీగా బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో సుమారుగా 950 మంది ఎంపిహెచ్‌ఎలకు హైకోర్టు ఉత్తర్వుల మేరకు తీసివేశారన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి, ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి వారికి న్యాయం చేయాలని కోరామని చెప్పారు. గ్రామ, మండల, రాష్ట్ర స్థాయి వరకు ఎపిఎన్‌జిఒ సంఘాన్ని పూర్తి స్థాయిలో నిర్మాణం చేపట్టాలని కార్యచరణ రూపొందినట్లు తెలిపారు. ఎపిఎన్‌జిఒ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి.రమణ మాట్లాడుతూ డిమాండ్ సాధనకు ప్రభుత్వంతో పోరాటం చేసే నేతలకు డిమాండ్ల సాధనకు ఉద్యోగులందరూ సమైక్యంగా సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఎపిఎన్‌జిఒ కడప జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి ఉద్యగులకు రావలసిని అన్ని డిమాండ్స్ సాధిస్తారానే నమ్మకం ఉందన్నారు. కార్యక్రమంలో ఎపిఎన్‌జిఒ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి జగదీష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రసాద్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి శివప్రసాద్, ఎపిఎన్‌జిఒ కడప జిల్లా కార్యదర్శి నిత్యపూజయ్య, అనంతపురం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రమోహన్, కడప తాలూకా అధ్యక్షులు చిన్నయ్య, కోశాధికారి నాగార్జున, ఉపాధ్యక్షులు రాజగోపాల్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ వీరారెడ్డి, జాయింట్ సెక్రటరీ మోహన్‌రెడ్డి, ఉమెన్ వింగ్ చైర్మన్ గౌరి, చిత్తూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవులు, రమేష్ రాయచోటి ఎన్‌జిఒ అధ్యక్షులు డి.వెంకటేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి మహాదేవ, జిల్లాలోని వివిధ తాలూకాల్లోని ఎన్‌జిఒలు, పెన్షనర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా అడ్‌హక్ కమిటీ ఏర్పాటు : ఎపిఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు అడహక్ కమిటీ సభ్యులను ప్రకటించారు. కమిటీ చైర్మన్‌గా వేణుగోపాల్‌రెడ్డి, కన్వీనర్‌గా శ్రీనివాసన్, కోశాధికారిగా నాగేశ్వర్‌రావు, కమిటీ సభ్యులుగా గణేష్, రెడ్డిశేఖర్, నాగరాజు, నరసింహలను ఎన్నుకున్నారు. త్వరలో అడ్‌హక్ కమిటీ సభ్యులు అన్ని తాలూకా యూనిట్స్‌తో కలిసి అన్నమయ్య జిల్లా బాడీని ఎన్నుకుంటారన్నారు. అనంతరం ఎన్‌జిఒ సంఘ రాష్ట్ర నేతలను జిల్లా, తాలూకా ఎన్‌జిఒ నాయకులు, ఎన్‌జిఒలు, ఆర్‌టిసి నాయకులు, పెన్షనర్లు ఘనంగా సన్మానించారు.

వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రమేష్‌బాబు



వర్షాలతో దెబ్బతిన్న వరి పంటలను పరిశీలిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గుర్రంకొండ

భారీ వర్షాలతో పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రమేష్ బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలో భారీ వర్షాలకు నీట మునిగిన వరి, వేరుశనగ పంటలను పరిశీలించారు. రైతులను అడిగి పంట నష్టం జరిగిన తీరును తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా కురిసిన వర్షాలకు రైతులు సాగు చేసిన పంటలన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. బోరు బావులు కింద ఎక్కువ మంది రైతులు వేరుశనగ పంటను సాగు చేశారని తెలిపారు. వర్షాలు కురవడంతో రూ.లక్షలు సాగు కోసం అప్పులు చేసి పెట్టుబడి పెట్టిన రైతులకు ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వీరాంజనేయులు అనే కౌలు రైతు ఎకరం వరి పంట నీట మునిగిందన్నారు. దేవేంద్ర అనే మరో రైతు రెండు ఎకరాలు వేరుశనగ పంట వేయగా ఎక్కువ వర్షంతో పంట నల్లగా మారిపోయి, కాయలు చెట్టుకు ఒకటి లేదా రెండు ఉన్నాయని తెలిపారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయం చేసుకొని మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో పర్యటించి పంట పొలాలను రైతులతో కలిసి పరిశీలించి నష్టపోయిన పంటలతో పాటు రైతుల వివరాలు సేకరించాలని పేర్కొన్నారు. రైతులకు సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు ఇవ్వాలని కోరారు. నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం ఆదుకునే విధంగా జిల్లా అధికారులకు సకాలంలో నివేదికలు పంపాలని కోరారు. ముఖ్యంగా ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ నష్టపోయిన రైతులకు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. లేకపోతే రైతులను కలుపుకుని కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు దేవేంద్ర, రహంతుల్లా, శ్రీనాథ్‌రెడ్డి, వీరాంజనేయులు పాల్గొన్నారు.

పేరుకు మాత్రమే స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ

- డిసిసి అధ్యక్షులు గాజుల భాస్కర్



మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షులు గాజుల భాస్కర్

ప్రజాశక్తి-రాయచోటి

రాయచోటి పట్టణం స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా పేరుకు మాత్రమే ఉందని, వాస్తవంగా పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజుల భాస్కర్ అన్నారు. గురువారం డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణలో కొద్దిపాటి వర్షానికే డ్రెయినేజీ వ్యవస్థ పూర్తిగా స్తంభించి, మహమ్మద్‌అలీపురావీధి, కొత్తపల్లి ప్రాంతాల్లో డ్రెయినేజీ నీరు ఇండ్లలోకి ప్రవేశిస్తోందన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న భయంకరమైన సమస్యగా మారిందని తెలిపారు. మున్సిపల్ అధికారులు ప్రజల సమస్యలను పూర్తిగా పట్టించుకోవడం లేదని విమర్శించారు. గత నెలలో కురిసిన తేలికపాటి వర్షానికే నలుగురు ప్రాణాలు బలయ్యారున్నారు. ఇప్పటికీ అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. డ్రెయినేజీ వ్యవస్థను తక్షణమే పునరుద్ధరించి, శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లా చోటుచేసుకున్న బస్సు ప్రమాదంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు సజీవ దానం కావడం బాధాకరమని, ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలిన్నారు. భవిష్యత్తులో ఎలాంటి సంఘటన జరగకుండా ప్రభుత్వం చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రాయచోటి-పింఛా రోడ్ పనులు పూర్తి చేయాలి:

రాయచోటి-పింఛా రహదారి ప్రయాణం అంటే నరకానికి ప్రయాణించినట్టేనని వెంటనే అధికారులు స్పందించి రోడ్ పనులు పూర్తి చేయాలన్నారు. ఈ రహదారి నరకానికి ద్వారం తెరిచినట్టుందన్నారు. ప్రయాణికులు ప్రాణాలను పణంగా పెట్టుకొని ప్రయాణం చేస్తున్నారు. గర్భిణులు, వృద్ధులు, విద్యార్థులు, ఉద్యోగులు నిత్యం ఈ రహదారిపై ప్రయాణిస్తుంఆరని పేర్కొన్నారు. పనులు ప్రారంభించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం చూస్తే ప్రజా వ్యతిరేక పాలనకు నిదర్శనమన్నారు. ప్రజలు ఈ రహదారి ద్వారా రాయచోటికి వస్తే ప్రమాదాలను ఎదుర్కోవాల్సి వస్తోందని, ఎన్నో ప్రాణాలు ఇప్పటికే బలయ్యాయని గుర్తుచేశారు. అధికారులు వెంటనే మేల్కొని ఈ రహదారిని పునరుద్ధరించాలని, లేదంటే కాంగ్రెస్ పార్టీ ప్రజలతో కలిసి ఆందోళనకు దిగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధికారి ప్రతినిధి మన్సూర్ అలీ, డిసిసి ఉపాధ్యక్షులు దర్బార్ బాషా, డిసిసి చీఫ్ సెక్రటరీ అమీర్ బాషా, జిల్లా మైనార్టీ అధ్యక్షులు సయ్యద్ అలీ, సల్మాన్ పాల్గొన్నారు.

కర్నూలు బస్సు దుర్ఘటన దురదృష్టకరం

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

కర్నూలు జిల్లాలో ప్రయివేటు బస్సు దుర్ఘటన దురదృష్టకరమని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భయానక ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న నిరాపరాధ ప్రజలు సజీవదహనం కావడం హృదయ విచారకమని తెలిపారు. ఈ విషాదకర సంఘటనతో అనేక కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో మునిగిపోయినట్లు పేర్కొంటూ, మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియ జేశారు. ఇలాంటి విషాదకర ప్రమాదాలు భవిష్యత్తులో మరల చోటుచేసుకోకుండా ఉండేందుకు రోడ్డు రవాణా విభాగం, బస్సు యాజమాన్య సంస్థలు కఠినమైన భద్రతా ప్రమాణాలు, నియమావళి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలు అమూల్యమని, నిర్లక్ష్యం ప్రాణాంతకమవుతుందని హెచ్చరించారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి : సిపిఎం

రాయచోటి అర్బన్: హైదరాబాద్ నుండి బెంగుళూరు వెళుతున్న ప్రయివేట్ బస్సు కర్నూలు వద్ద అగ్ని ప్రమాదానికి గురై 19 మంది మరణించడంపై సిపిఎం జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. గాయపడిన వారికి అత్యవసర చికిత్స అందించి ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బస్సులు నిర్వహించే ప్రయివేటు యాజమాన్యాలు ప్రమాదాలు జరగకుండా తగిన రక్షణ చర్యలు తీసుకోకపోవడం వల్లనే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని విమర్శించారు. హైవేలలో ప్రమాదాల నివారణకు ప్రభుత్వాలు కూడా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. **కలికిరి:** కర్నూలు రోడ్డు ప్రమాదంలో బస్సు దగ్ధమై పలువురు ప్రయాణికులు మరణించడం బాధాకరమని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హైదరాబాదు నుండి బెంగళూరు వెళ్తున్న ప్రయివేట్ ట్రావెల్స్ బస్సులో మంటలు చెలరేగి ప్రాణాలు కోల్పోయిన ప్రయాణికుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని పేర్కొన్నారు. ప్రమాద ఘటనపై ప్రభుత్వం అన్ని సహాయక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

మెరుగైన వైద్యం అందించాలి : 'గడికోట'


ప్రజాశక్తి - రాయచోటి టౌన్



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

రోగులకు వైద్యం అందించి మన్ననలను పొందాలని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. పట్టణంలో నూతనంగా డాక్టర్ మహేశ్వర్‌రెడ్డికి చెందిన మహేశ్వర్‌రెడ్డి క్రిటికల్ కేర్ ఆస్పత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగుల ప్రాణాలను కాపాడడం, వారికి నాణ్య మైన వైద్య సేవలు అందించడం అత్యంత పవిత్రమైన వైద్యసేవని పేర్కొన్నారు. అభివృద్ధి చెందుతున్న పట్టణంలో ఆధునిక సదుపాయాలతో కూడిన ఈ తరహా ఆసుపత్రులు ప్రారంభం కావడం గర్వకారణమన్నారు. క్రిటికల్ కేర్ వైద్యులు డాక్టర్ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్యం అందిస్తామని, ఆర్‌టిసి డ్రైవర్, కండక్టర్‌లకు ఉచితంగా ఒపి చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి పోలు సుబ్బారెడ్డి, వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు పల్లపు రమేష్, ప్రముఖ వైద్యులు డాక్టర్ బయారెడ్డి, నాయకులు శంకర్‌రెడ్డి, దివాన్, శ్రీనివాసులురెడ్డి, ఎర్ర బయన్న, నల్ల బయన్న పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ ఆస్పత్రి ప్రారంభం



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న రామమూర్తి

ప్రజాశక్తి-పీలేరు

రోగులకు మెరుగైన వైద్యం అందించడమే వైద్యులకు లక్ష్యంగా ఉండాలని పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామమ్మూర్తి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని కోటపల్లి సర్కిల్లో పృథ్వీ ఫిజియోథెరపీ, రిహాబిలిటేషన్ ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు ఉత్తమ వైద్య సేవలు అందించి, అత్యవసర రోగులం దరికి ప్రతిరోజు అందుబాటులో ఉండాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పోలిశెట్టి సురేంద్ర, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కలప రవి, కామిశెట్టి సుధాకర్, చెన్నా మురళి, కల్లూరు మునిరత్నం, దూది నరేష్, సురేష్, ఖాదర్, సూరి కంప్యూటర్స్ అధినేత సురేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హోటళ్లలో పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



హోటల్ కిచెన్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

రెస్టారెంట్లు, హోటళ్లు, టిఫిన్ సెంటర్లలో పరిశుభ్రత పాటించాలని జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారి కె.ఎస్.బాష పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు రెస్టారెంట్లు, హోటళ్లలో స్థానిక మున్సిపల్ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వ హించారు. పరిశుభ్రత పాటించని కొన్ని హోటళ్లకు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా బాషా మాట్లాడుతూ రెస్టారెంట్లు, హోటళ్లలో పరిశుభ్రత ముఖ్యమని, వంటకాలు వండే కిచెన్‌లోనూ, వడ్డించే ప్రాంతంలోనూ శుభ్రంగా ఉండాలన్నారు. మన్నికగల కూరగాయలను, వస్తువులను వాడాలని సూచించారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా హోటళ్లు, రెస్టారెంట్లు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యతను ఎఫ్‌ఎంటి ట్రైనర్లు రైతులకు అర్థం చేయించాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా డిపిఎం వెంకట మోహన్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ (ఎపిసిఎన్‌ఎఫ్) సంస్థ ఆధ్వర్యంలో జిల్లా డిపిఎం కార్యాలయంలో రెండు రోజులపాటు ఫీల్ లెవెల్ మాస్టర్ ట్రైనర్ (ఎఫ్‌ఎంటి) లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. మానవ జీవితంలో ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యతను గురించి ఎఫ్‌ఎంటి లు రైతాంగానికి అవ గాహన కల్పించాలని కోరారు. ప్రక ృతి వ్యవసాయం ద్వారా రసాయనాలు లేకుండా భూమి ఆరోగ్యం మెరుగుపడి నాణ్యత పెరు గుతుందన్నారు. రైతుల ఆదాయం, ఆహార భద్రత పెరుగుతుందన్నారు. శిక్షణ పొందిన ఎఫ్‌ఎం రేటైనర్లు తమ పరిధిలోని రైతులను ప్రోత్సహించి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను గురించి అర్థం చేయించాలన్నారు ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించడం దాని ప్రాముఖ్య తను రైతులకు తెలియజేయడమే శిక్షణ కార్య క్రమం లక్ష్యంగా తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలోని పలు మండలాలకు చెందిన ఎఫ్‌ఎంటి ట్రైనర్లు పాల్గొన్నారు.

టెట్ పరీక్షపై ప్రభుత్వం పునఃసమీక్షించాలి

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వం నిర్వహించిన డిఎస్‌స పరీక్ష ద్వారా ఎన్నికై దాదాపు 25 సంవత్సరాల పైబడి సర్వీస్ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు ఇప్పుడు పరీక్షలు నిర్వహించడం చాలా ఇబ్బందిగాను కష్టంగానూ ఉంటుందని దీనిని ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి ఉపాధ్యాయులకు ఉపశమనం కలిగించాలని నోబెల్ టీచర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టులో టెట్ పరీక్షపై రివ్యూ పిటిషన్ దాఖలు చేసి మన వాదనలు వినిపించాలని కోరడమైనది ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాష్ట్రంలో ఉపాధ్యాయుల్లో ఉన్న గందరగోళ పరిస్థితికి ముగింపు పలకాలన్నారు. దేశవ్యాప్తంగా సుప్రీం కోర్టులో సెప్టెంబర్ ఒకటో తేదీన జారి చేసిన టెట్ పరీక్షల తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో కేసు దాఖలు చేసి వాదించి తదుపరి కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి ఇలాంటి వ్యవహారం నుండి ఉపాధ్యా యులకు ఉపశమనం కలిగించాలని పేర్కొన్నారు. 50 సంవత్సరాలు వయస్సు పైబడిన ఉపాధ్యాయులు ఆరోగ్య సమస్యలతో సతమతమవుతూ ఎంతో ఆందోళనలకు గురవుతున్న విషయాన్ని గుర్తించి ఈ సమస్య నుండి ఉపశమనం కలిగించాలన్నారు. 2003 డిఎస్‌సి ద్వారా నియామకాలు పొందిన ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అతి త్వరలో పాత పెన్షన్స్‌కి అమలకు నిర్ణయం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో షేక్ మహమ్మద్ హాషిం, పాలెం రాజా వెంకటరమణ, శ్రీనివాసులు, బాలాజీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్‌టిఎ రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు

30 వర్క్‌షెడ్లు, మగ్గాలు మంజూరు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కేంద్ర ప్రభుత్వం చేనేత, జౌళి మంత్రిత్వ శాఖ 2023-24 సంవత్సరానికిగాను 4 స్మాల్ క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం పథకాలను నియోజకవర్గంలోని కోళ్లబైలు, రాజానగర్, నీరుగట్టువారిపల్లి, మదనపల్లి రూరల్ ప్రాంతాలకు మంజూరు చేశారని శుక్రవారం జిల్లా చేనేత, జౌళి శాఖాధికారి ఆర్.పవన్ కుమార్‌రెడ్డి వెల్లడించారు. రూ.580.14 లక్షల ప్రాజెక్ట్ వ్యయంతో ఈ పథకం కింద మోటరైజ్, పర్న వెల్డింగ్ డబ్బామిషన్లు, గుంత మగ్గాలు, ఫ్రేం మగ్గాలు, 240 హుక్స్ జాక్ కార్డు, ఎలక్ట్రానిక్ జాకార్డు మెషిన్, మోటరుతో కూడిన లిస్టింగ్ మిషన్ 3 లివర్, 2 లివర్ పరికరాలు మొదలైనవి చేనేత కార్మికులకు అందించడం జరుగుతుందన్నారు. ఈ పథకం కింద చేనేత లబ్ధిదారుల నుండి వారు కోరిన పరికరాల మొత్తం విలువలో 10 శాతం మొత్తాన్ని వారి వాటా కింద చెల్లించాలని, మిగిలిన 90 శాతం మొత్తాని కేంద్ర ప్రభుత్వం భరిస్తుందని వివరించారు. మొదటి విడతగా 425 మంది క్లస్టర్ సభ్యులకు చేనేత మగ్గాలు, ఇతర మగ్గాలు సంబందిత పరికరాలను పంపిణీ చేయుడానికి గాను రూ.228.522 లక్షల మంజూరయ్యాయన్నారు. మొదటి విడతలో మంజూరైన పరికరాలను అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేయబడుతాయని, అర్హులైన 30 మంది చేనేత కార్మి కులకు 30 వర్క్ షెడ్డులను మంజూరు చేశామన్నారు. ఒక్కొక్క వర్క్ షెడ్డుకు రూ.1.20 లక్షలు మంజూరు చేసి ఈ మొత్తం నిధులను కూడా కేంద్ర ప్రభుత్వ వాటా నుండి చెల్లిస్తుందని తెలిపారు. లబ్ధిదారులు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. పైన పేర్కొన్న నాలుగు క్లస్టర్ సభ్యులకు చేనేత మగ్గాలు, ఇతర మగ్గం పరికరాలను ఈ నెల 25వ తేదీన పట్టణంలోని ఓ ప్రయివేటు కల్యాన మండపంలో ఎమ్మెల్యే పంపిణీ చేయనున్నారన్నారు.

పిపిపి విధానాన్ని వ్యతిరేకిస్తున్న కూటమి నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: పిపిపి విధానాన్ని కూటమి ప్రభుత్వంలోని బిజెపి, జనసేన పార్టీ నాయకులే వ్యతిరేకిస్తున్నారని, సంతకాల సేకరణ ఉద్యమంలో తమతోపాటు సంతకాలు చేసి మద్దతు ఇస్తున్నారని వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఈనెల 28న నిర్వహించే ర్యాలీ పోస్టర్ ఆవిష్కరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మదనపల్లె వైసిపి పరిశీలకులు అనూషరెడ్డి, నిస్సార్ అహమ్మద్, వైసిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిస్సార్ అహమ్మద్ మాట్లాడుతూ మదనపల్లె మెడికల్ కాలేజ్ నిర్మాణంలో పిపిపి విధానాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 28న సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించి, సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా హాజరై బిడ్డల భవిష్యత్తు కొరకు, పేద ప్రజల ఆరోగ్యం కొరకు ప్రభుత్వ ఆసుపత్రి, మెడికల్ కళాశాల ప్రయివేటు పరం కాకుండా కాపాడుకుందామని తెలిపారు.

గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించి, గిరిజన హక్కుల పరిరక్షణకై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు వడిత్యా శంకర్ నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో గిరిజన ప్రజా చైతన్య యాత్ర వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు కావస్తున్న నేటికీ రాష్ట్రం లక్షలాదిమంది గిరిజనులకు కనీసం కూడు, గూడు, నీడ లేక పరితపిస్తున్నారని, ఇప్పటికీ రేషన్ కార్డు, ఆధార్ కార్డు లేక దుఠరేమైన జీవితాలు జీవిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సంఘం జిల్లా నాయకులు నాగూనాయక్, కృష్ణ గోపాల్ నాయక్, చిన్ని నాయక్, గిరిజన ప్రజా సమాఖ్య నాయకులు మూడే ప్రసాద్ నాయక్, సోమశేఖర్ నాయక్, నాగే నాయక్, సురేంద్ర నాయక్, లక్ష్మా నాయక్, మంగే నాయక్, నరసింహ నాయక్, హనుమంతు నాయక్ పాల్గొన్నారు.



వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న ఉపకులపతి యువరాజ్

'మిట్స్'లో స్రాడెక్స్ లెర్నింగ్ వెబ్‌సైట్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లె సమీపంలోని మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీలో నూతన విద్యా సాంకేతిక సంస్థ స్రాడెక్స్ లెర్నింగ్ ప్రయివేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూపొందించిన అధికారిక వెబ్‌సైట్ sradexlearning.comను యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ సి.యువరాజ్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ వెబ్‌సైట్‌ను కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్) విభాగంలో బీటెక్ మూడవ సంవత్సరం విద్యార్థి ఎం.గణేష్‌రెడ్డి రూపొందించినట్లు తెలిపారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్య, ఆన్‌లైన్ కోర్సులు, ఇంటర్న్‌షిప్ అవకాశాలను విద్యా ర్థులకు అందించడమే ఈ ప్లాట్‌ఫామ్ ప్రధాన లక్ష్యమని వివరించారు. విద్యార్థులు స్వయంగా ముందుకు వచ్చి ఇలాంటి సృజనాత్మక ప్రాజెక్టులు రూపొందించడం ఎంతో అభినందనీయమన్నారు. ఇలాంటి యాజమాన్యాలు విద్యా రంగంలో కొత్త దిశగా మార్పు తీసుకురాగలవుని పేర్కొన్నారు. స్రాడెక్స్ లెర్నింగ్ స్టార్టప్ వ్యవస్థా పకుడు గణేష్‌రెడ్డికి విశ్వవిద్యాలయ అధికారులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా ప్రతి విద్యార్థి ఆవిష్కర్తగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విద్యా, శిక్షణ, డిజిటల్ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగ డీన్ డాక్టర్ చంద్ర ప్రకాష్ గుప్త, విభాగాధిపతి డాక్టర్ ఆర్.కల్పన, డాక్టర్ చొక్కనాదన్, డాక్టర్ ఆర్.తులసి రామ్‌నాయుడు పాల్గొన్నారు.

రాయుడు కాలనీలో పిచ్చి మొక్కలు తొలగింపు

ప్రజాశక్తి-రాయచోటి : పట్టణ శివారులోని రాయుడు కాలనీలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, టిడిపి నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, మేనల్లుడు మౌర్యారెడ్డి ఆదేశాల మేరకు టిడిపి నేత మడితాటి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో తొలగింపు కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. రాయుడు కాలనీ టిడిపి నేత రంజిత్ రాయల్ ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాయుడు కాలనీలో ప్రతి సమస్యను కూడా రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పరిష్కరిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో, ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరగడంతో ప్రజలకు వాహనదారులకు ఇబ్బందులు పడుతున్నట్లు మంత్రి దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. సానుకూలంగా స్పందించిన మంత్రి మున్సిపల్ అధికారులకు ఆదేశించి అక్కడ నెలకొన్న సమస్యను పరిష్కరించాలని ఆదేశించారన్నారు. రాయుడు కాలనీలో స్థానికులతో కలిసి తొలగింపు కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో నాగరాజా,రమణ, లడ్డు, రామయ్య, శివరాం, బాషా పాల్గొన్నారు.



పిచ్చమొక్కల తొలగింపు పనులు పరిశీలిస్తున్న రంజిత్


వేయింగ్ మిషన్లను తనిఖీ చేస్తున్న దివ్య

తూకాల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

తూకాల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ దివ్య అన్నారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండలం లోని చౌక దుకాణాలలో వినియోగిస్తున్న తూకపు యంత్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 25 చౌక దుకాణాలు ఉన్నాయన్నారు. అందులో లబ్ధిదారులకు బియ్యం, చక్కెర, ఇతర సరుకులను పంపిణీ చేయడానికి వినియోగించే తౌకపు యంత్రాలను తనిఖీ చేశామన్నారు. తూకాలలో వ్యత్యాసాలు ఉన్న యంత్రాలను సరిచేసి, సర్వీసింగ్ చేసి, సీలు వేశామన్నారు. ఇలా ప్రతి సం వత్సరం తూనికలు కొలతల శాఖ నుంచి తనిఖీలు నిర్వహించి యంత్రాలను పరిశీ లిం చి సీలు వేయడం జరుగుతుందన్నారు. చౌక దుకాణదారులు కూడా లబ్ధిదారులకు పం పిణీ చేయాల్సిన సరుకులలో అక్రమాలకు పాల్పడకుండా సక్రమమైన తూకాలను వేయాలన్నారు. ప్రయివేట్ దుకాణాలలోనూ త్వరలోనే తనిఖీలు చేస్తామన్నారు. తూ కాలలో అక్రమాలకు పాల్పడుతూ ప్రజలకు మోసం చేసే వారిపై చర్యలు తీసు కుంటామని తెలిపారు. ఎక్కడైనా ఇటువంటి అవకతవకలను, మోసాలను ప్రజలు గుర్తిస్తే వెంటనే తమకు సమాచారం తెలియజేయాలని తెలిపారు. కార్యక్రమంలో చౌక దుకాణా డీలర్ల సంఘం నాయకులు గంగాధర, మల్లేశ్వరరావు, చౌక దుకాణాల డీలర్లు పాల్గొన్నారు.

సెమిస్టర్-2 పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి -నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సెమిస్టర్-2 పుస్తకాలను శుక్రవారం పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగనపల్లి వెంకటరమణ ఆధ్వర్యంలో ఎంఇఒ అనం తకృష్ణ, ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీచేశారు. విద్యార్థులకు పుస్తకాల భారాన్ని తగ్గించే క్రమంలో పాఠ్యపుస్తకాలను రెండు విడతలలో ప్రభుత్వం సరఫరా చేసింద, అందులో భాగంగా నవంబరు నెల నుంచి మొదలయ్యే సెమిస్టర్ 2 సిలబస్‌కు ముందు గానే ప్రభుత్వం పుస్తకాలను సరఫరా చేసింది. ఈ సందర్భంగా ఎంఇఒ, హెచ్ ఎం మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేసిన పాఠ్యపు స్తకాలను సక్ర మంగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు నాగిశెట్టి లక్ష్మీనారాయణ, వల్లూరు మస్తాన్, ఫిజికల్ డైరెక్టర్ గౌరీ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

విద్యార్థినులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని మధ్యాహ్నం భోజన వర్కర్లకు ఎంపిడిఒ అబ్దుల్ షకూర్ సూచించారు.శుక్రవారం పట్టణం లోని జడ్‌పి బాలికలు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యతోపాటు నాణ్యమైన భోజనాన్ని అందిం చే ఉద్దేశంతో మధ్యాహ్నం భోజనం పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకం లో భాగంగా ఒక్కోరోజు ఒక్కో రకమైన ఆహారం పిల్లలకు వడ్డించాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు సక్రమంగా అన్నిరకాల ఆహారం అందిం చాలన్నారు. మధ్యాహ్న భోజనం పథకంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు .అనం తరం విద్యార్థినులతో మధ్యాహ్నం భోజనం నాణ్యతపై ఆరా తీశారు.

నిత్యావసర సామగ్రి వితరణ

ప్రజాశక్తి-పుల్లంపేట



విభిన్న ప్రతిభావంతడికి నిత్యావసర సరుకులు అందిస్తున్న సభ్యులు

మండల పరిధిలోని తపాలా శాఖ గ్రామీణ డాక్ కార్యాలయంలో, గ్రామీణ డాక్ సేవకుల సహకారంతో పుల్లంపేట విభిన్న ప్రతిభావంతుల సమైక్య సేవా సంఘం ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్లు సంఘ అధ్యక్షులు మల్లు సుబ్బనరసారెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల స్థితిగతులను అర్థం చేసుకుని, వారికి అవసరమైన సహాయం అందించేందుకు గ్రామీణ డాక్ సేవకులు చూపిస్తున్న సేవాభావం ఎంతో ప్రశంసనీయమని తెలిపారు. సేవలతోపాటు తమ దాతృత్వాన్ని ప్రదర్శిస్తూ 22 రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేయడం అభినంద నీయమ న్నారు. కార్యక్రమంలో తపాలాశాఖ గ్రామీణ డాక్ సేవకులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలల పరిరక్షణకే కోటి సంతకాలు

-వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి-చిన్నమండెం


సంతకాల సేకరణలో శ్రీకాంత్‌రెడ్డి

ప్రభుత్వ వైద్యశాలల పరిరక్షణకు కోటి మంది గళమెత్తనున్నారని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని మల్లూరు, కొత్తపల్లె,వండాడి, టి.సాకిబండ, దిగువగొట్టి వీడు గ్రామాల ప్రజలు, వైసిపి నాయకలు, కార్యకర్తలతో రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని వైసిపి రాష్ట్ర కార్యదర్శి దేవనాథరెడ్డి, మండల కన్వీనర్ గోవర్ధన్ రెడ్డి తదితర నాయకులతో కలసి పాల్గొన్నారు. రచ్చబండ కోటి సంతకాల సేకరణ కరపత్రాలను విడుదల చేసి సంతకాలు చేయించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రాయచోటి ప్రాంతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయంలోనూ, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హయంలోనూ శాశ్వత, అభివృద్ధి పనులు జరిగాయన్నారు. వెలిగల్లు, శ్రీనివాసపురం, ఝురికోన ప్రాజెక్ట్ లు,రాయచోటికి రింగ్ రోడ్డు, పట్టణానికి శాశ్వత తాగునీటి పరిష్కారం, జిల్లా కేంద్రం చేయడం, అన్ని గ్రామాలలో గ్రామ సచివాలయాలు ,రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్ ఉద్యోగాలును కల్పించిన వై.ఎస్.జగన్‌కే దక్కు తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, ఆరోగ్యశ్రీ తదితర రంగాలను ప్రయివేట్ పరం చేయడానికి కుట్రలు పన్నుతున్నా రన్నారు. కార్యకర్తల సమస్యల విషయంలో రాజీకి అవకాశమే లేదన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బాబురెడ్డి, విశ్రాంత డిప్యూటీ తహశీల్దార్ తిమ్మారెడ్డి, మండల జెసి యస్ కన్వీనర్ చుక్క అంజప్ప, సర్పంచులు లక్ష్మి రెడ్డి, ముసల్ రెడ్డి, సర్పంచు కుమారుడు రామ్మూర్తి, ఎంపిటిసి శ్యామ్ చంద్ర, నరసయ్యస్వామి, శ్రీరాములు, మాజీ ఎంపిటిసి రమణ, మాజీ సర్పంచులు చక్రపాణిరెడ్డి,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **నిమ్మనపల్లె:**మండలంలోని ఎగువ మాచిరెడ్డిగారిపల్లెలో శనివారం ఉదయం 10 గంటలకు మదనపల్లి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్ ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకిస్తూ కోటి సంతకాల కార్యక్రమాన్ని చేపడుతున్నామని వైసిపి మాజీ మండల అధ్యక్షులు ఆర్‌ఐ.రమణారెడ్డి తెలిపారు.మండలంలోని నాయకులు, కార్యకర్తలు, వైసిపి అనుబంధ విభాగాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ప్రజలకు ఇబ్బందుల్లేకుండా తక్షణ చర్యలు : 'ముక్కా'


హైలెవల్ వంతెన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న రూపానందరెడ్డి

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

భారీ వర్షాల కారణంగా పట్టణంలోని ప్రజలు ఇబ్బందులు పడకుండా తక్షణ చర్యలు చేపడతామని కుడా చైర్మన్, టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపా నందరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచి పోవడంతో పాటు, పాత రోడ్లు అధ్వాన పరిస్థితికి చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో రూపానందరెడ్డి స్వయంగా పలు వీధుల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. నరస రావుపేట ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఏటి రక్షణ గోడ పనులను, వెంకయ్య స్వామిగుడి సమీపంలో గుర్రప్పపాలెం ఎస్‌టి కాలనీ మార్గంలో నిర్మాణంలో ఉన్న హై లెవెల్ వంతెన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పట్టణంలోని రాంనగర్ నందు ఆయన ప్రజలతో దుకాణాల యజమానులతో మాట్లాడి ఎక్కడెక్కడ నీరు నిలు స్తుందో, డ్రెయినేజీ వ్యవస్థ ఎక్కడ ఇబ్బందికరంగా ఉందో అడిగి తెలుసుకున్నారు. పాత రోడ్లు పూర్తిగా దెబ్బతిన్న ప్రాంతాలను కూడా పరిశీలించి, వర్షాల వల్ల ఏ రోడ్లు ప్రమాదకరంగా మారాయో వివరాలు సేకరించారు.ఈ సందర్భంగా ముక్కా రూపా నందరెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు తక్షణ చర్యలు తీసుకుంటామని ఎక్కడ నీరు నిలిచినా వెంటనే మోటార్లు ఏర్పాటు చేసి నీరు తొలగించాలనీ, డ్రెయినేజీ లైన్లను శుభ్రం చేయడంతో పాటు, దెబ్బతిన్న రోడ్ల మర మ్మతులు తక్షణమే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పట్టణం శుభ్రంగా, సురక్షితంగా ఉండేలా కృషి చేస్తామని, రైల్వే కోడూరు ప్రజలకు ఎప్పుడైనా 24 గంటలు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తక్షణమే పరిష్కరిం చేందుకు కృషి చేస్తామ న్నారు. కార్యక్రమంలో అధికారులు ఎంపిడిఒ నాగిరెడ్డి, ఆర్‌ఐ లక్ష్మీదేవి, కూటమి నాయ కులు డిసిఎంఎస్ చైర్మన్ వై.జయప్రకాష్, గడికోట సుబ్బరాయుడు, మౌలా, కోమ్మ శివ, శివారెడ్డి, సుబ్బారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, హేమరాజ్, సుకుమార్‌రెడ్డి, మణి పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి-కలికిరి

రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం, అధికారులు పనిచేస్తున్నారని ట్రాన్స్‌కో ఎడిఇ శివయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని తుమ్మలపేట, సి.బర్నేపల్లిలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అదనపు 5 ఎంవిఎ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను విజయవంతంగా చార్జ్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిఎ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు 24గంటలు నాణ్యమైన విద్యుత్‌ను అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అందులో భాగంగా గుట్టపాలెం పంచాయతీలోని సి.బర్నేపల్లి సబ్‌స్టేషన్, కలికిరి మేజర్ పంచాయతీ పరిధిలోని తుమ్మలపేట సబ్‌స్టేషన్‌లో అదనపు లోడు కలిగిన ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించారు. దీనివల్ల చుట్టుపక్క సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో నాణ్యమైన విద్యుత్‌ను అందుతుందని దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎఇ ముజుబుర్ రెహ మాన్, ఇఇ విజయ భాస్కర్ రెడ్డి, ప్రొటెక్షన్ ఎఇ సుబ్రహ్మణ్యం, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటి పరిరక్షించాలి

ప్రజాశక్తి-గాలివీడు : ప్రపంచ వాతావరణ దినోత్సవం సందర్భంగా గాలివీడు మండలం తలముడిపి గ్రామ పంచాయతీలో శుక్రవారం రెడ్స్, సేత్రీ సంస్థ తరపున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రైతు గండికోట బయ్యారెడ్డి పొలంలో సుమారు 5ఎకరాలకు నిమ్మ, మహాగని, ఎర్రచందనం, టెంకాయ 1,034 మొక్కలను నాటారు. పద్మావతి, రవీంద్రరెడ్డి అనే రైతులకు సన్మానించారు. ఇంతటి నాణ్యమైన మొక్కలను ఉచితంగా అందించిన రెడ్స్, సేత్రీ సంస్థకు రైతు భయ్యారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రైతులు, రెడ్స్ సంస్థ ఎఫ్‌సి భారతమ్మ పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న వెంకట్రామయ్య

గైర్హాజరైన విద్యార్థులకు ప్రత్యేక రిజిస్టర్

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి : పాఠశాలకు గైర్హాజరు అయిన విద్యార్థుల కోసం ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించాలని సమగ్రశిక్ష ప్రత్యామ్నాయ సమన్వయకర్త వెంకట్రామయ్య పేర్కొన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాల నాయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు రాకుండా బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. అంతేకాకుండా చాలా మంది విద్యార్థులు పాఠశాల మానేసి పనులకు వెళుతూ ఉంటారని అలాంటి డ్రాప విద్యార్థులను గుర్తించి వారిని పాఠశాలలో చేర్పించాలన్నారు. దీర్ఘకాలంగా పాఠశాలకు గైర్హాజరైన సక్రమంగా పాఠశాలకు రాని విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి పాఠశాలకు వచ్చేటట్లు చూడాలన్నారు. సిఆర్‌పిలు కూడా ప్రత్యేక తీసుకొని పల్లెలకు వెళ్లి బడికి వెళ్ళకుండా పనులకు వెళ్లే పిల్లలు గుర్తించి వారిని బడిలో చేర్పించాలన్నారు. ప్రతి విద్యార్థి గైర్హాజరు కారణాన్ని స్పష్టంగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ చెక్రేనాయక్, ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలు, రామ్మోహన్ పాల్గొన్నారు.


ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతన్న డిడి దేవరాజులు

కెజిబివిలో డిడి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి- కలకడ :మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాలను రాష్ట్ర కెజిబివి డిప్యూటీ డైరెక్టర్ దేవరాజులు ఆకస్మింగా తనిఖీలు నిర్వహించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల హాజరు ఉపాధ్యాయుల హాజరు తనిఖీలు చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాలు తనిఖీ చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పదోతరగతి విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదిగేలా లక్ష్యాలు ఏర్పరచుకోవాలని సూచించారు. పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధిం చాలని, అందుకు ప్రణాళిక బద్ధంగా చదవాలన్నారు. అనంతరం సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి పిల్లలతో స్నేహపూర్వకంగా మెల గాలని, వారికి ఇబ్బంది కలగకుండా తల్లిదండ్రుల వలె చూసు కోవా లని సూచించారు. కార్యక్రమంలో గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ సుమతి, ఎపిఒ చంద్రశేఖర్, ప్రిన్సిపల్ అనిత, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

గోడపై నుంచి పడి విద్యార్థికి తీవ్రగాయాలు

- దెబ్బతిన్న కిడ్నీలు..ఆదుకోవాలని తల్లిదండ్రుల వేడుకోలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట : పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ షమీ కుమారుడు మహమ్మద్ అయాన్ ప్రమాదవశాత్తు గోడపై నుంచి కిందకు పడి తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో బాలుడి కిడ్నీలు ఎక్కువగా దెబ్బతిని తీవ్ర అనారోగ్యానికి గుర య్యారని తల్లిదండ్రులు తెలిపారు. అపరేషన్ చేయాలని వైద్యులు చెప్పారని లేకుంటే ప్రమాదకమని వైద్యులు చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఆపరేషన్ చేయాలని రూ.10లక్షలు ఖర్చవు తుందని తెలపారని అన్నారు. ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న తమకు అంత ఆర్థిక స్థోమత లేదని పేర్కొన్నారు. దాతలు ఎవరైన సాయం చేసి బాబు ప్రాణాలు కాపాడాలని ముకులిత హస్తాలతో వేడుకుంటున్నారు. సాయం చేయదలచిన వారు 78937 17761 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అయాన్‌ను చూపుతున్న తల్లిదండ్రులు


భారీ వర్షాలకు కూలిన ఇల్లు

కుప్పకూలిన ఇల్లు

-త్రుటిలో తప్పించుకున్న కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-సుండుపల్లి : గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని సుండుపల్లి గ్రామపంచాయతీలో అక్కంపల్లి గ్రామంలో తమ ఇల్లు కుప్ప కూలిందని బాధితులు వాసు, నాగరాణి తెలిపారు. శుక్రవారం తెల్లవారు జామున కుటుంబ సభ్యులతో కలిసి నిద్రిస్తున్న సమయంలో ఏదో చిన్న పెచ్చు ఎగిరి కిందపడటంతో అందరం మేల్కొని బయటకు వచ్చామని వెంటనే గోడ కూలిపోయిందని తెలిపారు. కుటుంబమంతా త్రుటిలో పెను ప్రమాదం నుంచి బయటపడ్డామని పేర్కొన్నారు. 2003లో ప్రభుత్వం తమకు పక్కా గృహం మంజూరు చేసిందని అప్పటి నుంచి అదే ఇంటిలో నివాసమంటూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. ఇప్పుడు తిరిగి ఇంటిని ఇంటిని నిర్మించుకునే స్తోమత తమకు లేదని ప్రభుత్వం తమను ఆదుకొని పక్కా గృహం మంజూరు చేయాలని వేడుకున్నారు.

భారీ వర్షానికి కూలిన పాఠశాలల ప్రహరీ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండలంలో గురువారం మధ్యాహ్నం నుంచి కురిసిన భారీ వర్షానికి రెండు పాఠశాలల్లో ప్రహరీ కూలినట్లు ఎంఇఒ పద్మావతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత మూడు రోజుల నుంచి మండలంలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయన్నారు. గురువారం మధ్యాహ్నం నుంచి శుక్రవారం తెల్లవారుజామున వరకు భారీ వర్షం కురవడంతో రెడ్డివారిపల్లెలోని జడ్‌పి హైస్కూల్ ప్రహరీ పునాదితో సహా కూలి కొట్టుకపోయిందన్నారు. బాలినా యన పల్లెలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాల లోని ప్రహరీ కూలిపోయిందన్నారు. ఆ సమయంలో అక్కడ ఎవరు లేకపో వడంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదన్నారు. పాఠశాలకు ఏర్పడిన ఆస్తి నష్టాన్ని ఉన్నతా ధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలి పారు. ప్రస్తుతం విస్తారంగా వర్షాలు పడుతున్నందున పాఠశాల సమయంలో ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండి విద్యార్థులను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని సూపర్‌వైజర్లు చంద్రకాంత, రమణమ్మ పేర్కొన్నారు. శుక్రవారం ఐసిడిఎస్ తంబల్లపల్లి ప్రాజెక్టు పరిధిలో జడ్‌పి హైస్కూల్, మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాలలో అంతర్జాతీయ బాలిక దినోత్స వాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు పాల్గొని బాలికల సంరక్షణపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ఎవరైనా 18 ఏళ్ల లోపు బాలికలు వివాహం జరిపితే చట్టపరంగా శిక్ష అనుభవిస్తారని తెలిపారు. బాలికల సమస్యలపై 1098,100, 181కు ఫోన్ చేసి సంప్రదించ వచ్చని తెలిపారు. పిల్లలు అన్ని రంగాలలో బాగా రాణించాలని, బాగా చదువుకోవాలని తెలిపారు. తల్లిదండ్రులు ఆడ, మగ పిల్లలను సమానత్వం చూడాలని, తారతమ్య భేదం చూపరాదన్నారు. బాలికలకు ఎడ్యుకేషన్, స్పీచ్, వాస్యరచన, పోటీలు నిర్వహించి హెచ్‌ఎం చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థినికి బహుమతి అందిస్తున్న సూపర్‌వైజర్లు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రోడ్డు ప్రమాదంలో మహిళ తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన శుక్రవారం బి. కొత్తకోట మండలంలో జరిగింది. బాధితురాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మదనపల్లె పట్టణం, అమ్మ చెరువుమిట్టకు చెందిన శిరీష, సోమశేఖర్ దంపతులు సొంత పనులపై ద్విచక్ర వాహనంలో బి. కొత్తకోటకు వెళ్లారు. అక్కడ పనులు ముగించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. గ్రామ శివారులో శిరీషకు కళ్లు తిరగడంతో వాహనంలో నుంచి కింద పడిపోయింది. తీవ్రంగా గాయపడిన భార్యను 108లో భర్త మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు.ఎస్‌ఐ ఉమామహేశ్వర్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.

మృతుడి ఆచూకీ లభ్యం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : మదనపల్లె మండలంలోని సిటియం రైల్వేస్టేషన్‌లో గురువారం మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి ఆచూకీ లభ్యమయ్యింది. కదిరి రైల్వే హెడ్ కానిస్టేబుల్ మహబూబ్ బాష కథనం మేరకు.. పలమనేరు మండలం, గంగవరం సమీపంలోని పాతూరుకు చెందిన చెంగ్రాయప్ప (64)గా తెలిసిందన్నారు. ఇతనికి భార్య కాంతమ్మ, కుమారుడు మురళి, కుమార్తె భారతి ఉన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఇతను ఇంట్లో చెప్పకుండా కొద్దిరోజులు బంధువులకు ఇళ్లకు వెళ్లిపోయి తిరిగి ఇంటికి వచ్చే అలవాటు ఉందన్నారు. ఈ క్రమంలో ఈ నెల ఒకటో తేదీన ఇంట్లోంచి వెళ్లిపోవడంతో తంబళ్లపల్లి మండలం, కోసవారిపల్లిలో ఉన్న కుమార్తె ఇంటికి వెళ్లి ఉంటాడని కుటుంబ సభ్యులు భావించారన్నారు. రైల్వేస్టేషన్‌లో మృతి చెందడంతో పత్రికల్లో వచ్చిన వార్తను చూసి మృతదేహాన్ని గుర్తించిన కుటుంబసభ్యులు రైల్వే పోలీసులను ఆశ్రయించారు. మృతదేహాన్ని బంధువులు గుర్తించడంతో వారికి అప్పగించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. ముదివేడు ఎస్‌ఐ దిలీప్ కుమార్ కథనం మేరకు.. ములకలచెరువు మండలం, తుమ్మలవారి పల్లికి చెందిన వెంకటరమణ (45) ఈనెల 7వ తేదీన మదనపల్లె నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళ్తూ అంగళ్లు వద్ద రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. తిరుపతిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న టిప్పర్

- తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి


టిప్పర్ ఢీకొనడంతో వంగిన విద్యుత్ స్తంభం

మదనపల్లె-తంబళ్లపల్లె రోడ్డుపై ఎంపిడిఒ కార్యాలయానికి సమీపంలో శుక్రవారం ఉదయం ఓ ఇసుక టిప్పర్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. స్థానికులు వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో విద్యుత్ సరఫరా నిలిపి వేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ లైన్ కింద పడి ఉంటే ఆస్థి, ప్రాణనష్టం జరిగేదని, ప్రమాదం తప్పడంతో స్థానిక ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. విద్యుత్ శాఖ ఎఇ సురేంద్ర సంఘటన స్థలాన్ని పరిశీలించారు.